# ఏసీబీ సోదాలతో మంచిర్యాల రిజిస్ట్రార్‌లో కుదుపు

- డాక్యుమెంట్ రైటర్ల ఫోన్ నెంబర్లు, షాపుల ఫొటోలు తీసిన అనిశా అధికారులు
- రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు ఇచ్చిన సమాచారంతో ఆరా
- రాత్రి 8 గంటల వరకు ఫైళ్ల పరిశీలన
- ఫోన్ల ద్వారా డాక్యుమెంట్ రైటర్ల నుంచి కూపీ లాగుతున్న ఆఫీసర్లు
- వినియోగదారుల్లా నటించి జారుకున్న కాంట్రాక్టు ఉద్యోగులు?



మూసి ఉన్న డాక్యుమెంట్ రైటర్ల షాపులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ చేపట్టిన సోదాలు శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా హడలెత్తించాయి. ఉపాధ్యక్షతలో నడిచిన ఈ దర్యాప్తు, అక్కడ నెలకొన్న అవకతవకలపై గత కొన్ని రోజులుగా సేకరించిన ఇంటలిజెన్స్ ఆధారంగానే కొనసాగినట్లు విశ్వసనీయ సమాచారం.

**వినియోగదారుల నుంచి కీలక సమాచారం**

సాయంత్రం 5 గంటలకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన పలువురి వద్ద ఏసీబీ అధికారులు నేరుగా వివరాలు సేకరించారు. "ఎంతకు భూమి కొనుగోలు చేశారు? బ్యాంక్ చలాన్ ఎంత? డాక్యుమెంట్ ఫీజు ఎంత?" .. ఇలా ఒక్కొక్కరిని ప్రశ్నిస్తూ వారి వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. డాక్యుమెంట్లపై రాసిన ఫోన్ నెంబర్లను ఆధారంగా తీసుకుని డాక్యుమెంట్ రైటర్ల నెంబర్లను సేకరించి, షాపులకు వెళ్లి ఫొటోలు తీశారు. ఈ ప్రక్రియ ఏసీబీ దర్యాప్తు దిశ ఎంత లోతుగా సాగుతోందో స్పష్టం చేసింది. బయట ఉన్న డాక్యుమెంట్ రైటర్ల షాపులపై ఉన్న ఫోన్ నెంబర్లను లోపల కస్టమర్లు ఇచ్చిన డాక్యుమెంట్ల నెంబర్లతో పోల్చి కొన్ని కాల్స్ చేసినట్లు సమాచారం.

**ఏసీబీ కార్యాలయానికి సబ్ రిజిస్ట్రార్ ప్రియాంక**

సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ ప్రియాంకను ఏసీబీ అధికారులు ప్రశ్నల కోసం డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. ఇది సాధారణ తనిఖీ కాదని, ముందుగా సేకరించిన నిర్దిష్ట సమాచారంతోనే ఈ చర్య జరిగినట్లు కనిపిస్తోంది. ఇంతకుముందు రామగుండం కార్పొరేషన్ పరిధిలో పనిచేసిన సమయంలోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నట్లు వచ్చిన విమర్శలు ఈ దర్యాప్తుకు మరింత బలం ఇచ్చాయి. ఆమె సెలవులో ఉన్న రోజుల్లో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయన్న అంశంపై కూడా ఏసీబీ ప్రత్యేకంగా ఆరా తీసినట్లు తెలుస్తోంది.

**మెల్లగా జారుకున్న కాంట్రాక్టు ఉద్యోగులు**

సోదాలు మొదలైన వెంటనే కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది కాంట్రాక్టు ఉద్యోగులు ఒక్కొక్కరూ సాధారణ కస్టమర్లుగా బయటకు జారుకున్నారు. "భూమి కొనుగోలుకు వచ్చాం... పెళ్లి రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం..." అంటూ తప్పించుకోవడం ఏసీబీ విచారణను మరింత ఆసక్తికరంగా మార్చింది. సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తే వారి పాత్రలు బయటపడే అవకాశాలున్నాయని చర్చ సాగుతున్నది. ఇదే సమయంలో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు, కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు కొత్త కాదు. ఈ నేపథ్యంలో వచ్చిన ఏసీబీ దాడులు వ్యవస్థను అంతర్భాగం వరకూ కుదిపినట్లు కనిపిస్తోంది.

**అటెండర్ గౌస్ పరారీ ప్రయత్నం**


అటెండర్ గౌస్ ఏసీబీ అధికారులను చూసి బయటికి పరుగులు పెట్టడం మరో అంశంగా నిలిచింది. ఎందుకు పరారయ్యాడనే ప్రశ్నలు తలెత్తాయి. అతని వద్ద ఏమైనా నగదు లేదా పత్రాలు ఉన్నాయా? ఏసీబీ ఇంకా ఏ వివరాలూ ప్రకటించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అతని పరుగుపెట్టడం చూడగానే దస్తావేజు కార్యాలయం వద్ద ఉన్న షాపులు ఒక్కసారిగా మూతపడటం గమనార్హం.

**సాధారణ తనిఖీలే : ఏసీబీ**

సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు ఏసీబీ డీఎస్పీ మధు తెలిపినా, వారి చర్యల తీరుతో ఇది ముందే సిద్ధమైన దర్యాప్తు అన్న సందేశం స్పష్టమవుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, స్లాట్ బుకింగ్, డాక్యుమెంటేషన్ — ప్రతి అంశంలో వారు చేసిన క్రాస్ వెరిఫికేషన్ ఈ సోదాలు యాదృచ్ఛికం కాదని వెల్లడిస్తోంది.

**డాక్యుమెంట్ రైటర్లలో గుబులు**

షాపుల ఫొటోలు తీయడం, ఫోన్ నెంబర్లను సేకరించడం, కస్టమర్ల డాక్యుమెంట్లను పోల్చడం — ఇవన్నీ చూసి డాక్యుమెంట్ రైటర్లు ఇంతకు ముందు ఎప్పుడూ లేని విధంగా భయాందోళనకు గురయ్యారు.


రిజిస్ట్రార్ ప్రియాంకను విచారిస్తున్న ఏసీబీ అధికారులు


పారిపోయేందుకు యత్నించిన అటెండర్ గౌస్

## అంబేద్కర్ యువజన సంఘం మైనార్టీ విభాగం ఎన్నిక

**మైనార్టీ హక్కుల కోసం అంబేద్కర్ యువజన సంఘం ముందుకు**
**నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు క్యాదాసి ప్రభాకర్**



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ యువజన సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ శామీముద్దిన్, ఉపాధ్యక్షులుగా హైమద్ బిన్ అలీ,మహమ్మద్ అబ్దుల్, షఫీదుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఓసిదిద్దీన్ ఖాన్, కార్యదర్శులుగా సాజిత్, చంద్ పాషా, కోశాధికారిగా మహమ్మద్ అలీముద్దీన్, జావిద్ పాషా మహమ్మద్ సలీం, ఎండి రిజ్వాన్, ఎండి బాబా కార్యవర్గ సభ్యులుగా జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం బడుగు బలహీన వర్గాల కోసం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల కోసం నిరంతర ఉద్యమం చేపడుతున్నామని తమ హక్కులు వచ్చేంతవరకు ప్రభుత్వం మెడలు వంచి తెచ్చే వరకు కొట్లాడుతుందని సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా నూతనంగా ఎన్నుకున్నటువంటి మైనార్టీ జిల్లా కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు అదేవిధంగా నూతన మైనార్టీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ శామీయుద్దిన్ మాట్లాడుతూ అంబేద్కర్ అడుగుజాడల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల కోసం మైనార్టీ హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చెర్మన్ గజ్జల ఆనంద్ రావు, రాష్ట్ర దళిత సీనియర్ నాయకులు గొర్రె రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిలు మానాలా నారాయణ, మైసని మనోహర్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు కొండ్రా స్వరూప, జిల్లా ఉపాధ్యక్షులు తప్పట్ల అంజయ్య, జిల్లా సీనియర్ నాయకులు మామిడిపల్లి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నాగరాజు, సీనియర్ నాయకులు, మారపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

**కలెక్టర్ పమేలా సత్పతి**



**శెనార్తి మీడియా, చొప్పదండి :** ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి.. సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చొప్పదండిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్ పరిశీలించి రోగుల వివరాలు తెలుసుకున్నారు. డెలివరీ రూమ్, వార్డులు, మందులు ఇచ్చే గది పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడున్న పేషంట్లను వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.. అవసరమైన మందులు సిబ్బంది అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. సౌకర్యాలు సద్వినియోగం చేసుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలని మెడికల్ ఆఫీసర్ శ్రీకీర్తనకు సూచించారు. చికిత్స, పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చేవారి ఆధార్, ఫోన్ నెంబర్ తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద వైద్య పరీక్షలు చేసుకునే వారి సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఆరోగ్య మహిళ కింద 76 మంది పరీక్షలు చేసుకున్నట్లు కలెక్టర్ కు సిబ్బంది వివరించారు. రికార్డులను సరిగా మెయింటెన్ చేస్తూ.. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఎంపీడీవో వేణుగోపాల్ రావు, తహసీల్దార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

## యశోదలో ప్రోస్టేట్ గ్రంధి వాపునకు ఆధునిక చికిత్స

**యశోద హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ అమన్ చంద్రదేశ్ పాండే**



**శెనార్తి మీడియా, , కరీంనగర్ :** పురుషుల్లో వయస్సు పెరిగేకొద్దీ ప్రోస్టేట్ గ్రంధి పెరగడం ఒక సాధారణ సమస్యగా మారింది. ప్రోస్ట్రేట్ గ్రంధి సమస్యలపై సోమాజిగూడ యశోద ఆసుపత్రి ప్రముఖ యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ అమన్ చంద్ర దేశ్ పాండే మాట్లాడారు. నగరంలోని యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పరిస్థితిని వైద్యపరంగా బెనైన్ ప్రోస్టాటిక్ హైపర్ ప్లేసియా (బి పి ఎచ్) అని పిలుస్తారని తెలిపారు. ఇది క్యాన్సర్ కాకపోయినా, మూత్రం రావడంలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. ప్రోస్టేట్ ఎందుకు పెరుగుతుంది అంటే వయస్సుతో హార్మోన్ మార్పుల కారణంగా, ముఖ్యంగా డైహైడ్రో టెస్టోస్టెరాన్ ప్రభావంతో ప్రోస్టేట్ కణాలు పెరుగుతాయని, ఇది సహజ ప్రక్రియ అయినప్పటికీ కొందరికి అధికంగా పెరిగి సమస్యలు కలిగిస్తుందని వివరించారు. మూత్ర ప్రవాహం నెమ్మదిగా రావడం, ఆగి ఆగి రావడం, పూర్తిగా వెళ్ళలేదనే భావన, రాత్రిళ్లు పలుమార్లు మూత్రం కావడం, అకస్మాత్తుగా మూత్రం రావడం, ఆపుకోలేక పోవడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ప్రారంభ దశల్లో మందులు ఉపయోగించి ఉపశమనం పొందవచ్చు. మందులు పని చేయని రోగులకు ఆధునిక చికిత్సలు అవసరం అవుతాయని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టి యు ఆర్ పి పద్ధతిలో ఎలక్ట్రిక్ కరెంట్‌తో అదనపు ప్రోస్టేట్ కణజాలాన్ని తొలగించడం, లేజర్ ట్రీట్మెంట్ ద్వారా తొలిగించడం జరుగుతుంది. దీని వల్ల దుష్ప్రభావాలు ఉండవచ్చని చెప్పారు, దీనికి ప్రత్యామ్నాయంగా ఆధునిక రెజుమ్ స్టీమ్ పద్ధతి లో ప్రోస్టేట్‌లోకి ఆవిరిని పంపి అదనపు కణజాలాన్ని కరిగిస్తారు. మరొక పద్ధతి యూరోలిఫ్ట్ దీనిలో ప్రోస్టేట్ గోడలను చిన్న మెటల్ క్లిప్స్‌తో లాగడం ద్వారా మూత్రం వెళ్లే దారిని తెరుస్తారని, దీనిద్వారా తక్షణ ఫలితం ఉంటుందని తెలిపారు.ఇవి అత్యుత్తమ ఫలితాలు ఇస్తున్న ఆధునిక పద్ధతులు అని దీనివల్ల రక్తస్రావం చాలా తక్కువ ,త్వరితగతిన కోలుకుంటారని, అదే రోజు డిశ్చార్జ్ కావచ్చని తెలిపారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## స్లెట్ హైస్కూల్లో బాలల దినోత్సవం

**,జగిత్యాల, నవంబర్ 14 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్లేట్ హై స్కూల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నవంబర్ 14 మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ కు పిల్లలంటే అమితప్రేమ చూపిస్తారు.ఆయనకు గుర్తుగా నెహ్రు జన్మదినం పురస్కరించుకొని నవంబర్ 14 నాడు బాలల దినోత్సవంగా జరుపుతున్నారు. బాల, బాలికలు ఉపాధ్యాయ వేశాధారణలతో పాఠశాలలో తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న మాట్లాడుతూ బాలల దినోత్సవం గురించి వివరిస్తూ సమాజంలో విద్యార్థుల యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, రాజ్యలక్ష్మి ప్రిన్సిపాల్ స్వప్న, ఇంచార్జి మల్లిఖార్జున్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీహార్-బిజెపి దే


**బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి విజయం తో ఇల్లందకుంటలో సంబరాలు**

**టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసిన బిజెపి నేతలు**

**ఇల్లందకుంట, నవంబర్ 14 :** బీహార్ ఎన్నికలలో బిజెపి కూటమి విజయదుంబిక మోగించిన సందర్భంగా ఇల్లందకుంట మండలం గరుడ చౌరస్తా లో బీజేపీ మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికలు శుక్రవారం ఎన్నికల ఫలితాలు వేలువడడం ఈ ఎన్నికలలో 243 స్థానాలకు గాను నరేంద్ర మోడీ నాయకత్వం లో ఎన్ డిఏ కూటమి 206 స్థానాలను బీహార్ ప్రజలు బిజెపికి పట్టం కట్టారు, రాబోయే రోజుల్లో తెలంగాణా లో జరిగే స్థానిక ఎన్నికల్లో బీజేపీ ప్రజలు పట్టం కడతారని అన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి,జిల్లా కౌన్సిల్ మెంబెర్ గుత్తికొండ రాంబాబు, ప్రభాకర్ జీ, బొమ్మాడి శ్రీధర్ రెడ్డి,మట్ట పవన్ రెడ్డి,మురహరి గోపాల్,జోడు సంపత్, గురుకుంట్ల సంజీవ్, వడ్లకొండ జలపతి, శ్రీరాముల రమేష్,ఇంగ్లే రమేష్,చదువు సాయిరెడ్డి, గుర్రాల సధాకర్ రెడ్డి, సప్పి పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి వరం

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**శెనార్తి మీడియా,మానకొండూర్ :** నిరుపేదలను ఆదుకునేందుకే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నదని, కళ్యాణలక్ష్మి కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, 35 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లు వరంలాంటివన్నారు. ఆడ బిడ్డల పెళ్లిళ్లు భారంగా మారిన పరిస్థితుల్లో ఈ పథకాల ద్వారా అందించే సాయం వారి ఎంతో మేలుచేకూరుస్తుందన్నారు.అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న వారికి చేయూతనిందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. ఆయా వర్గాల వారికి అందించే ప్రభుత్వ పథకాల వినియోగించుకోవడం ద్వారా లబ్ధి పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో వరలక్ష్మి, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం, ఆర్.తిరుపతి, తాళ్లపల్లి నరేశ్, మడుపు ప్రేమ్ కుమార్, వాల అంజిత్ రావు, బోళ్ల మురళీధర్, కనకం కుమార్, కోండ్ర సురేష్, ఇర్ఫాన్, రాకేష్, సహదేవ్, దూలం దేవేంద్ర, రొంటాల లక్ష్మారెడ్డి, గొల్లెన కొమురయ్య,సాయిరి దేవయ్య, శ్రీనివాస్ గౌడ్, చెలికాని సదయ్య, మీస సత్యనారాయణ, వరహాల చారి, బుర్ర శ్రీకాంత్, ఎన్.బాపురావు, గుజ్జె ప్రభాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

